క్లుప్తంగా

రోడ్డు పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ సామంతపూడి

టి.నరసాపురం: ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు అన్నారు.మర్రిగూడెం, ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనులను బుధవారం ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్కినవారిగూడెం నుంచి మర్రిగూడెం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి 2.6 కిలోమీటర్ల మేర నిర్మాణానికి రూ.1.07 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీసెల్ కన్వీనర్ కురసం నిరీక్షణరావు, సర్పంచ్ సోయం బిందు, దారబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వీరభద్రునికి పట్టువస్త్రాలు


పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న దృశ్యం

కామవరపుకోట: కామవరపుకోటలో వేంచేసియున్న శ్రీ భద్రకాళీ సహిత శ్రీవీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయం నుంచి బుధవారం పట్టు వస్త్రాలు పూజాసామగ్రి సమర్పించారు. ఈమేరకు మద్ది దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కేసరి సరిత విజయభాస్కర్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు, దేవస్థానం ఈవో ఆకుల కొండలరావు, ధర్మకర్త చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, తదితరులు మేళతాళాలతో, వాయిద్యాలతో పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం వీరభద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులకు పట్టు వస్త్రాలు అందజేశారు.

ప్రత్యేక నిఘా

బుట్టాయగూడెం: రానున్న ఎన్నికల నేపథ్యంలో అంతరరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పోలవరం డీఎస్పీ ఎస్.సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు. పోలవరం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి ఆయన జీలుగుమిల్లి మండలంలో పర్యటించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఏపీ తెలంగాణ సరిహద్దు తాటాకులగూడెం వద్ద ఉన్న చెక్‌పోస్టును సందర్శించారు. ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

చింతలపూడి: పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ గోపాలకృష్ణ, సీఐ సుధాకర్ బుధవారం పరిశీలించారు. పాత చింతలపూడి, ఆర్కే నగర్, ఘంటావారివీధి, గవర్నమెంట్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్, మెయిన్‌రోడ్‌లో ఉన్న పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

పోలవరం రూరల్: మండలంలోని పోలవరం దేవరగొంది, మామిడిగొంది, వింజరం, చేగొండిపల్లి, ప్రగఢపల్లి గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లను ఎంపీడీవో జి.శ్రీను, ఎస్సై పవన్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.ప్రసాద్ బుధవారం పరిశీలించారు.

చెరువులో విషప్రయోగం

ద్వారకాతిరుమల: గుండుగొలనుకుంటలోని ఒక చేపల చెరువులో విషప్రయోగం జరిగింది. దీనిపై బాధిత రైతు సాధనాల సత్యన్నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. వివరాల ప్రకారం . రైతు సత్యన్నారాయణ పంచాయతీకి చెందిన రామరాజుకుంట చెరువును ఏడాదికి రూ.1.32 లక్షలకు, మూడేళ్ల కాల పరిమితికి లీజుకు తీసుకున్నాడు. అందులో చేపలు వేయడానికి, వాటి ఫీడ్‌కు ఇప్పటి వరకు రూ.14.50 లక్షలను ఖర్చు పెట్టాడు. ఇదిలా ఉంటే మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో కలుపుమందు చల్లారు. బుధవారం ఉదయం సత్యన్నారాయణ చెరువు వద్దకు వచ్చి చూసేసరికి చేపలు చనిపోయి ఉన్నాయి. పరిశీలించి చూడగా చెరువులో కలుపు మందు డబ్బా కనిపించింది. వాటర్ టెస్ట్‌తో పాటు, చేపలకు పోస్టుమార్టం చేసిన టెక్నీషియన్ చేపలు మృతి చెందడానికి విషప్రయోగమే కారణమని తేల్చారు.

సామాన్యుడి ఆత్మగౌరవం.. వలంటీర్లు


జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వార్డు వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం


కామవరపుకోటలో వలంటీర్లను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం: సామాన్యుడి ఆత్మగౌరవాన్ని కాపాడి, వారిలో జీవితం పట్ల విశ్వాసాన్ని పెంపొందిస్తున్న వ్యవస్థ వలంటీర్ వ్యవస్థ అని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో బుధవారం వలంటీర్‌లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణం, మండలానికి చెందిన వలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరించారు. ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలు ఎటువంటి కష్టాలు పడకూడదనే ఆలోచనను, కార్యరూపంలోకి తీసుకువెళ్లింది వలంటీర్ వ్యవస్థ అన్నారు. నేడు ఏ పని చేయాలన్నా ప్రజలకు వలంటీరే ముందు గుర్తుకు వస్తాడన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో వలంటీర్ వ్యవస్థ గొప్ప ఆస్తి అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరుపున వలంటీర్లు ఎనలేని సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అటువంటి వ్యవస్థపై చంద్రబాబు, పవన్ అనేక రకాల అభాండాలు వేస్తున్నారన్నారు. ఇది చాలా అవమానం, బాధాకరమని పేర్కొన్నారు. వలంటీర్ల వ్యవస్థ గురించి. ప్రపంచం గొప్పగా చెప్పుకుంటోందని, వలంటీర్ల వ్యవస్థ చిరకాలం ఉంటుందని అన్నారు. వలంటీర్ల సేవలు ప్రతి ఒక్కరికి అవసరం అని ఎంపీ పేర్కొన్నారు. చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు మాట్లాడుతూ వలంటీర్లు రాబోయే రోజుల్లో మరిన్ని సేవలందించడంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో వలంటీర్లు ఎన్నో సేవలందించి ప్రజలందరితో కొనియాడబడ్డారన్నారు. సీఎం జగన్‌కు ఈ ఐదేళ్లల్లో ఎంతో చేదోడు వాదోడుగా ఉన్న వలంటీర్లు రాబోయే రోజుల్లో కూడా ఇదే సహకారం అందించాలని విజయరాజు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షులు చిటికెల అచ్చిరాజు, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, ఎంపీపీ కొదమ జ్యోతి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి కాసర తులసీరెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, ఉభయ గోదావరి జిల్లాల బూత్ కమిటీ కన్వీనర్ బీవీఆర్ చౌదరి, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి సోంబాబు, మేడవరపు విద్యాసాగర్, బత్తిన చిన్న, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ దల్లి సాయిజ్యోతిక, చింతా అనిల్, ఆదిలక్ష్మి, గురజాల పార్థసారథి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, ఎంపీడీవో కార్యాలయ ఏవో గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం.. వలంటరీ వ్యవస్థ

కామవరపుకోట: వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం అని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో బుధవారం ఎంపీడీవో జె.స్వర్ణ భారతి అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా వజ్ర ఒకరికి, సేవా రత్న 5గురు, 294 మంది వలంటీర్లను సేవా మిత్ర అవార్డులతో ఆయన ఘనంగా సత్కరించారు. గత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీలు చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు ఎదుర్కొనేవారని, కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల, మత, వర్గ, రాజకీయ భేదాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలన్నా, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి వలంటీర్ సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కడిమి రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ కేసరి సరిత రెడ్డి, సొసైటీ చైర్మన్ సాయన్న కనకరాజు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ, సర్పంచులు కరిపోతూ అనూష, దేవరపల్లి రామ్మోహన్‌రావు, గుండుగోలు సుబ్బారావు, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, ఎంపీటీసీలు తమ్మిశెట్టి గిరిజ, మేడంకి పద్మ, సచివాలయాల కన్వీనర్ షేక్ మీరా సాహెబ్, సాయిలు స్వాతి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గ నియామకానికి నోటిఫికేషన్

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయ నూతన పాలకవర్గ నియామకానికి నోటిఫికేషన్ జారీ అయ్యిందని, ఆసక్తి ఉన్నవారు మార్చి 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈవో మానికల రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు ఆలయంలో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ జలకళ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి


మోటార్ల పంపిణీని ప్రారంభిస్తున్న దృశ్యం

చింతలపూడి: వైఎస్సార్ జలకళ ద్వారా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులకు ప్రభుత్వం ఉచితంగా బోర్లు, మోటార్లు అందించడం జరుగుతోందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. మండలంలో 3వ విడతలో మంజూరైన ఉచిత మోటార్లను బుధవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యండపల్లి, రేచర్ల ,యర్రంపల్లి, రాఘవాపురం, లింగగూడెం గ్రామాల రైతులకు 6 మోటార్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సన్న, చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డా బి.రాంబాబునాయక్, అధికారులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి శంకుస్థాపనలు


కామవరపుకోట నుంచి కళ్ళచెరువు వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ శ్రీధర్, విజయరాజు

కామవరపుకోట: రెండు దశాబ్దాలుగా మండలంలో అభివృద్ధికి నోచుకోని అన్ని రహదారుల పనులను సకాలంలో పూర్తి చేస్తామని ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు అన్నారు. రూ.30 కోట్లతో మూడు పంచాయతీ రాజ్ రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలో బుధవారం వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజుతో కలిసి పలు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందుగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికల వసతి భవనాన్ని, కామవరపుకోట ముతురాజు కాలనీలో రూ.10 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.7.40 కోట్లతో కామవరపుకోట నుంచి అంకాలంపాడు గ్రామపంచాయతీ జలపవారిగూడెం మీదగా కళ్ళచెరువు వరకు 10 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కామవరపుకోట నుంచి ఈస్ట్ యడవల్లి వరకు రూ.5 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. వీటితోపాటు చింతలపూడి నుంచి సీతానగరం వరకు గల పంచాయతీరాజ్ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి పెట్టారని అన్నారు. ఆర్అండ్‌బి రహదారులైన కామవరపుకోట నుంచి చింతలపూడి వరకు డబుల్ లైన్ వేసి ఆధునీకరిస్తామని, జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి నుంచి దూబచర్ల వరకు సుమారు 30 కిలోమీటర్ల వరకు ఉన్న రోడ్డు నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కడిమి రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం చైర్మన్, కేసరి సరితా రెడ్డి, నితిన్ రెడ్డి, సర్పంచ్ చొక్కా స్వర్ణ, వైస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్
- రూ. 10 లక్షలతో డిజిటల్ లైబ్రరీ ప్రారంభం


గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల వసతిగృహంలో భోజనాలను పరిశీలిస్తున్న కలెక్టర్

బుట్టాయగూడెం: వసతిగృహాల్లో మెనూ సక్రమంగా అమలు జరిగేలా చూడడంతోపాటు విద్యార్థుల ఆరోగ్యాలపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రిన్సిపాల్, వార్డెన్‌లను ఆదేశించారు. బుధవారం మండలంలోని బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో సుమారు రూ.10 లక్షలు సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని ఆయన ప్రారంభించారు. అలాగే ఫర్నీచర్, పుస్తకాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు డిజిటల్ లైబ్రరీకి వచ్చి పుస్తక పఠనం చేసేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. అలాగే పాఠశాల ఆవరణంలో క్రీడా మైదానం మెరుగుపరచడానికి, డైనింగ్ హాల్ ఏర్పాటుకు, ఖాళీగా ఉన్న మూడు రూమ్‌లను కలిపి ఒక డైనింగ్ హాల్‌గా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఏపీఓ, ఇన్‌చార్జి డీడీ పీవీఎస్ నాయుడును ఆదేశించారు. అదేవిధంగా లైబ్రరీ మెయింటెనెన్స్‌ను మంజూరు చేసిన నగదును కొత్త పుస్తకాల కొనుగోలుకు వినియోగించాలన్నారు. ఖర్చులను రిజిస్టార్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా లైబ్రరీలో ఉన్న వైట్ బోర్డును బ్లాక్ బోర్డుగా మార్చి ప్రతి రోజూ సూక్తులను ప్రదర్శించాలన్నారు. అనంతరం గిరిజన బాలికల గురుకుల పాఠశాల భోజనశాలను సందర్శించారు. అక్కడ వండిన ఆహార పదార్థాలను పరిశీలించి భోజనాలు నాణ్యతతో వండాలన్నారు. తాగునీరు స్వచ్ఛంగా ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్‌ని ఆదేశించారు. పాఠశాలలోని ఆటస్థలాన్ని పరిశలించారు. గ్రౌండ్ అభివృద్ధి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కేవీఎస్ఎస్ కుమార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం, ప్రిన్సిపాల్ రజనీబాయ్, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.విజయలక్ష్మి, సర్పంచ్ మడకం రామలక్ష్మి, ఎంపీడీఓ సుధా ప్రవీణ్, ఎంఈఓ తెల్లం బాబూరావు, బుద్దుల రాముడు, తదితరులు పాల్గొన్నారు.

నారసింహుని సేవలో మంత్రి వనిత


నారసింహుని ఆలయంలో ఆశీర్వచనాలు అందుకుంటున్న మంత్రి వనిత

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయాన్ని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి తానేటి వనిత బుధవారం సందర్శించారు. ఆలయంలో స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వాటిని పురస్కరించుకుని స్వామివారి దర్శనార్థం ఆలయానికి విచ్చేసిన ఆమెకు దేవస్థానం అధికారులు, అర్చకులు, పండితులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అర్చకులు, పండితులు ఆమెకు వేద ఆశీర్వచనాన్ని పలికి, పట్టు వస్త్రాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఆర్.లక్ష్మణస్వామి స్వామివారి మొమెంటోను, ప్రసాదాలను అందించారు.

వేడుకగా నారసింహుని కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్.జగన్నాధపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు.

జగనన్నను గెలిపించేందుకు సిద్ధం కావాలి


ఐఎస్ జగన్నాథపురంలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి వనిత

ద్వారకాతిరుమల: పేదల ముఖ్యమంత్రి జగనన్నను వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించుకునేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత పిలుపునిచ్చారు. గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన తర్వాత తొలిసారిగా ఆమె బుధవారం రాజమండ్రి ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌తో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత పర్యటన చేశారు. అందులో భాగంగా ఐఎస్ జగన్నాధపురం, ఐఎస్ రామానుజపురం, ఐఎస్ రాఘవాపురం, లక్ష్మీపురం, గొడుగుపేట, దేవినేనివారిగూడెం, సంధ్రకుంట, తంకెళ్లపాడు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. అలాగే పి.కన్నాపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయాలను ప్రారంభించారు. ఈ సందరర్భంగా ఆయా గ్రామాల్లో ఆమె వైఎస్సార్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి వనిత మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి సంక్షేమ పథకాలను జగనన్న ఇక్కడ అమలు చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా దీవెన, విద్యా వసతి, విదేశీ విద్య వంటి ఎన్నో పథకాలను అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఏ పథకం పొందాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆపరిస్థితి లేదన్నారు. గత చంద్రబాబు పాలనలో బడ్జెట్, ప్రస్తుత జగనన్న పాలనలో బడ్జెట్ ఒకటేనని, అయితే అప్పట్లో ఇన్ని పథకాలు అమలు చేయలేదని, మరి ఆ సొమ్ములు ఎవరి జేబులోకి వెళ్లాయని ప్రశ్నించారు. నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అలాగే కాపు, ఈబీసీలకు ఆర్థిక భరోసాను ఇచ్చిన సీఎం జగనన్న అని అన్నారు. సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజలను జగన్ సోమరిపోతులను చేస్తున్నారని విమర్శిస్తున్న ప్రతిపక్షాలు అవే పథకాలను అందిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మళ్లీ ఇవే పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను గెలిపించాలన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేశారన్నారు. అగ్ర కులాల నిరుపేదలకు సైతం సంక్షేమ పథకాలను అందించి ఆదుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, ఆచంట బన్ను, బోళ్ళ శ్రీను, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రామప్రభ, మండల మహిళా అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పసుపులేటి ఏసుబాబు, పసుపులేటి సాయిబాబు, దాకారపు బంగారమ్మ, భోగరాజు సాయి కృష్ణ, కుంటం స్వర్ణలత, జంగా వెంకట కృష్ణారెడ్డి, గుర్రాల లక్ష్మణ్, మానుకొండ కన్నయ్య, దాసరి ఏసురత్నం, ఉప్పల మునేశ్వరరావు, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దరెడ్డి నాగేశ్వరరావు, పెద్దిన దిలీప్, బాజీ, కస్సే శ్రీహరిరావు, స్పోర్ట్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, మటపర్తి పుల్లారావు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం 8వ సచివాలయం పరిధిలో అశ్వారావుపేట ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో, పట్టణంలో హెల్త్ క్లినిక్‌లు, ఆసుపత్రుల అభివృద్ధి, ఆరోగ్య శ్రీ ద్వారా రూ. 25లక్షల వరకు వైద్యం చేయించుకునే వెసులుబాటు కల్పిస్తున్నారన్నారు. 108, 104 ద్వారా అందించే సేవలను మెరుగుపర్చారన్నారు. ఇంటికే వైద్య సేవలు అందించాలనే తపనతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. మనందరి మేలుకోరే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపించి మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య, మాజీ పట్టణ అధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, కౌన్సిలర్‌లు కంచర్ల గీత, నేకూరి కిషోర్, తడికమల్ల మురళి, కోఆప్షన్ సభ్యులు వెంప ఐజి, ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ భావన బుషి, సచివాలయ కన్వీనర్ చింతపూరి శేఖర్, పార్టీ సీనియర్ నాయకులు బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న, కంచర్ల విష్ణు, గెద్దాడ శీను తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీవో విచారణ

జంగారెడ్డిగూడెం: దెందులూరు గ్రామ పంచాయతీలో కోటి రూపాయలకు పైగా జరిగిన నిధుల దుర్వినియోగంపై బుధవారం జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో కార్యాలయంలో డీఎల్‌పీవో ఎండీ రజావుల్లా విచారణ నిర్వహించారు. దెందులూరు గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు డీఎల్‌పీవో ఈ విచారణ నిర్వహించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్యదర్శి యెహోషువ, ప్రస్తుత కార్యదర్శి వి.శ్రీనివాస చౌదరి, పంచాయతీ సిబ్బంది పూర్తి రికార్డులతో హాజరుకాగా, తనకు ఆరోగ్యం బాగాలేదని, 15 రోజుల్లో విచారణకు హాజరవుతానని దెందులూరు గ్రామ సర్పంచ్ తోట ఏసమ్మ లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారు. కాగా తొలుత కార్యదర్శులను విచారించిన అనంతరం సర్పంచ్‌ను విచారిస్తామని డీఎల్‌పీవో తెలిపారు. విచారణ లోతుగా చేయాల్సి ఉందని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. కాగా, ఇప్పటికే సర్పంచ్ చెక్ పవర్‌ను జిల్లా కలెక్టర్ రద్దు చేసిన సంగతి విదితమే.

మాతృభాషా దినోత్సవం

జంగారెడ్డిగూడెం: స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బుట్టాయగూడెం డిగ్రీకళాశాల తెలుగు ఉపన్యాసకురాలు వై.సునీత మాతృభాష ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని, విశిష్టతను తెలియజేశారు. తెలుగు భాష అమ్మలాంటిదని అమ్మను కాపాడుకున్నట్లే మాతృభాషను కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ 'కమ్మనైన అమ్మ భాష, మాతృభాష నుంచే ఇతర ఏ భాషలు అయినా నేర్చుకోవచ్చని, కావున అమ్మ భాషను విడనాడకూడదని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. ఎం.మధు, అధ్యాపకులు ఎం.శ్రీనివాసరావు, పి.సన్యాసిరావు, వి.హనుమంతరావు, డాక్టర్ జి.వెంకట్‌లాల్, విద్యార్థులు పాల్గొన్నారు.